
మండపేటలోని కొండపల్లి వారి వీధిలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం


రాయవరం మండలం సోమేశ్వరంలో వినాయక మంటపం వద్ద యువత సందడి


కపిలేశ్వరపురంలో గణనాథుని మండపం వద్ద చిన్నారులు


ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో చవితి పూజలందుకుంటున్న దుండి గణపతి

భక్తి శ్రద్ధలతో వినాయకుని పూజలు

- వాడవాడలా గణపతి నవరాత్రుల సందడి
- ఆకట్టుకుంటున్న సెట్టింగ్‌లు

రామచంద్రపురం రూరల్: వినాయచవితిని పురస్కరించుకుని మండలంలోని గ్రామాలలో సోమవారం వినాయకుని పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయంలో కొలువైఉన్న దుండి గణపతికి దేవస్థానం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పాలవిల్లి కట్టి పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయ ప్రాంగణంలో జోగా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే సెట్టింగ్ వేశారు. వెలంపాలెం కంబాలచెరువు వద్ద భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తాళ్లపాలెం, వెలంపాలెం, తోటపేట, అన్నాయిపేట, జగన్నాయకులపాలెం, వేగాయమ్మపేట తదితర గ్రామాల్లో పందిళ్లు వేసి వినాయక చవితి పండగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

కె.గంగవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మంటపాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శిబిరాల వద్ద సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులపాటు శిబిరాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు చెప్పారు.


ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఆకర్షిస్తున్న గణపతి మంటపం

కొలువుదీరిన గణనాథులు

మండపేట: విఘ్నాలు తొలగించే గణనాథుని చవితి వేడుకలు వాడవాడలా ఘనంగా మొదలయ్యాయి. వివిధ రూపాల్లో మండపాల్లో పార్వతీ సుతుడు కొలువు దీరి భక్తుల పూజలు అందుకుంటున్నారు. మండపేటలోని బ్యాంకు కాలనీ, గాంధీనగర్, సైదిల్‌పేట, రావులపేట, వేగుళ్ల వారి చావిళ్లు, పాట మీద, వీరభద్రపురం, సంఘం కాలనీ, గొల్లపుంత కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 60 మండపాలు వెలిశాయి. సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ఆయా ఉత్సవ కమిటీల వారు నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలతో పాటు రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్థానిక కొండపల్లి వారి వీధిలోని వేదుళ్ల వారి దొడ్డిలో 15 అడుగుల విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మండలంలోని కేశవరం, ద్వారపూడి, ఏడిద, అర్తమూరు, తాపేశ్వరం, పాలతోడు, వెలగతోడు, ఇప్పనపాడు, మెర్నిపాడు తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, ప్రజలు స్వామివార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మహా గణపతిం.. మనసా స్మరామి

రాయవరం: వాడవాడలా ఏకదంతుని మండపాలు వెలిశాయి. మండపాల వద్ద ఆలయ కమిటీలు పోటాపోటీగా విగ్రహాలను ఏర్పాటు చేశాయి. అదనపు ఆకర్షణగా పలు చోట్ల విద్యుత్తు దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. మండపాల్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర ప్రతిమలను గ్రామాల్లో ఊరేగించారు. రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో చవితి వేడుకలను భక్తులు ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

పీఠంలో..

మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో చవితి వేడుకలు నిర్వహించారు. చవితి వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వినాయక వ్రత విశిష్టతను పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులకు వివరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వి.వి.బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి)ల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


కె.గంగవరంలో కొలువైన గణనాథుడు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో వినాయక చవితి పందిళ్ల సందడి నెలకొంది. నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గ్రామాల కూడళ్లలో శిబిరాలను నెలకొల్పి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పుణ్య దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేస్తున్నారు. దీంతో తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి వల్లూరు, నేలటూరు తదితర గ్రామాల్లో సందడి నెలకొంది.

క్లుప్తంగా

నేడు మండపేట మండల సమావేశం

మండపేట: మండపేట మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ఐ. రాజు తెలిపారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో చేపటనున్న అభివృద్ధి పనులపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కుందూరు విద్యార్థి


ఉపాధ్యాయులతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రియ

కె.గంగవరం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయిందని హెచ్ఎం చింతలపూడి ఆదినారాయణమూర్తి చెప్పారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14 బాలికల విభాగంలో హైజంప్, లాంగ్‌జంప్‌లో కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి గుబ్బల కుందన లక్ష్మీ ప్రియ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రియ పాల్గొంటుందని హెచ్ఎం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు


కపిలేశ్వరపురంలో అంగన్‌వాడీలకు ఫ్యాన్లు అందజేస్తున్న దాత, సర్పంచ్

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురానికి చెందిన దాత మేకా కాశీ విశ్వనాథం ఆర్థిక సాయంతో 11 అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం ఫ్యాన్లు సమకూర్చారు. దాత విశ్వనాథం, సర్పంచ్ సాకా శ్రీనివాస్ చేతుల మీదుగా ఫ్యాన్లను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో మేకా భాస్కరరావు, కొరిపెల్ల శ్రీనివాస్, నామాల అచ్యుతరామయ్య, వట్టికూటి వీర్రాజు తదితరులు దాత విశ్వనాథంను అభినందించారు.

పంట తెగుళ్లపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాలలో ఏట పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత, మధ్యలో చెదురు మదురు వర్షాల కారణంగా వరి పంట పలు రకాల వ్యాధులు, తెగుళ్ల బారిన పడుతోందని, రైతులు తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మండల గ్రామాలలో వరి పంట దుబ్బుకట్టే దశలో ఉందని, ఈ దశలో పైరుకు పొటాష్ ఎరువు తప్పని సరిగా వెయ్యాలన్నారు. వీఏఏలు రమ్య, శిరీషా, పలువురు రైతులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్పల పయనం


అయ్యప్పలకు ఇరుముడి ధారణ చేస్తున్న గురుస్వామి పీఎస్ఆర్

రాయవరం: నలభై రోజుల దీక్ష అనంతరం అయ్యప్పలు శబరిమలకు పయనమయ్యారు. రాయవరం గ్రామంలో పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్) ఆధ్వర్యంలో 30 మంది అయ్యప్పలు మాలధారణలు చేసి దీక్షలు చేపట్టారు. మంగళవారంతో దీక్ష పరిపూర్ణం కావడంతో ఇరుముడి కట్టుకుని అయ్యప్పలు శబరిమలకు పయనమయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్పలకు ఇరుముడి ధారణ చేసే సమయంలో రాయవరంనకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్య స్వాములు, కత్తిస్వాములు, గురుస్వాములు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మామిడికుదురు: యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న పెదపట్నం అగ్రహారం గ్రామానికి చెందిన గెద్దాడ ఉమా మహేశ్వరరావును అరెస్టు చేశామని రాజోలు ఎస్ఈబీ ఎస్సై రఘు మంగళవారం తెలిపారు. ఉమా మహేశ్వరరావు వద్ద నుంచి 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఈబీ ఎస్సై రఘు తెలిపారు.

టిడ్కో ప్లాట్ల వద్ద వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చేతిపంపుల ఏర్పాటుకు భూమిపూజ

మండపేట: పట్టణంలోని టిడ్కో ప్లాట్ల వద్ద ప్రజలు సౌకర్యవంతంగా జీవించేందుకు వీలుగా అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. ప్లాట్లలోని నివాసితుల నీటి అవసరాల నిమిత్తం మున్సిపల్ సాధారణ నిధులు రూ.30 లక్షల వ్యయంతో ప్రతి రెండు బ్లాకులకు మధ్యలో చేతి పంపు ఏర్పాటు పనులకు మంగళవారం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబులతో కలిసి ఎమ్మెల్సీ తోట భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుస్తులు ఉతుక్కునేందుకు వీలుగా చేతిపంపు వద్ద ప్లాట్‌ఫాంలు నిర్మిస్తారన్నారు. మొత్తం 110 చేతి పంపులను నిర్మించనున్నట్టు వివరించారు, స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, ఏఈలు కేవీ సత్యనారాయణ, డీవీ పవన్‌కుమార్‌లతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ వైస్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, శెట్టి కల్యాణి, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఏఎంసీ డైరెక్టర్లు షేక్ మస్తాన్, కొప్పిరెడ్డి పద్మావతి, పార్టీ నాయకులు గుమ్మిలేరు శ్రీనివాస్, కొడమంచిలి భాస్కరరావు, సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొన్నారు.


చేతిపంపుల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం, తాడిపల్లి గ్రామాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. వచ్చే నెల 3 వ తేదీన కాపవరంలో జరగనున్న మెడికల్ క్యాంపులో పాల్గొనేలా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి గ్రామ సర్పంచ్‌లు యనమదల మంగాదేవి, పిల్లి అచల రాజశ్రీ, ఎంపీపీటీసీ రెడ్నం సతీష్‌ల చేతుల మీదుగా టోకెన్లు అందజేశారు. డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు మాట్లాడుతూ బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, కఫం పరీక్షలతో పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీ వంటి మొత్తం ఏడు రకాల పరీక్షలు ఇంటింటి సర్వేలో భాగంగా ఇంటి వద్దనే ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్నారన్నారు. ఈ పరీక్షల ఫలితాలను దగ్గర ఉంచుకుని మెడికల్ క్యాంపులో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, మరో ఇద్దరు స్పెషలిస్టు వైద్యుల వద్ద చూపించుకుని సరైన వైద్యం అందుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. సీహెచ్ఓ, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, స్వప్న, హెల్త్ అసిస్టెంట్ చంద్రరావు పాల్గొన్నారు.


కాపవరంలో వృద్ధురాలికి మెడికల్ క్యాంపు టోకెన్ అందజేస్తున సర్పంచ్ మంగాదేవి

ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మూడు నెలల క్రితం హైదరాబాద్ నుంచి స్వగ్రామం వెళ్ల వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు మర్రెడ్డి రాజేష్, గానుగుల సాయిరామ్, ఈతా వర ప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరు అయిన ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చెక్కులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఉప సర్పంచ్ అన్యం శాంతకుమారి, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, నాయకులు పంతగడ విజయప్రసాద్, గుత్తుల రామప్రసాద్, తోట వీరభద్రరావు, బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలిపారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి వేణు

భీమన్న రచనలతో ప్రజల్లో చైతన్యం

మామిడికుదురు: మహాకవి బోయి భీమన్న తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రబాబు పేర్కొన్నారు. భీమన్న 112వ జయంత్యుత్సవంలో భాగం మంగళవారం మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం ప్రాంగణంలో ఉన్న భీమన్న విగ్రహానికి పలువురు ప్రముఖులు, సహృదయ సాహితీ సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూపతి వెంకటపతి, మంగం సత్యనారాయణ, వాసంశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రముఖ కవి బోయి భీమన్న జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంబేడ్కర్ సాహితీ సమితి అధ్యక్షుడు నేలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భీమన్న చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎంపీడీఓ ఎం.భారతి, మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్, నాయకులు అంబటి కోటేశ్వరరావు, జి.పాల్‌ప్రసాద్, పసలపూడి స్వర్ణలత, మంగం సత్యనారాయణ, మేకల రామకృష్ణ, బీవీ సత్యనారాయణ, పొలమూరి విక్రమ్, కడలి సత్యనారాయణ, ఆర్.రామకృష్ణ, వర్మ, మనోజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరకకు చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలోని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బోయి భీమన్న జీవితం-సాహిత్యంపై పుస్తకం ఆవిష్కరణ జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా, బోయి భీమన్న సతీమణి హైమవతి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కత్తిమండ ప్రతాప్ స్వీయ సంపాదకత్వంలో బోయి భీమన్న సాహిత్యంపై ప్రత్యేక వెబినార్ నిర్వహించారు.

జగనన్న పాలనలో పేదలకు చేయూత

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- కాజులూరులో కొత్త పింఛన్ల పంపిణీ

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని పేదలకు చేయూత లభిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం కాజులూరు మండల పరిషత్ ఆవరణలో జరిగిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్తగా మంజూరైన 453 వికలాంగ, వితంతు, వృద్ధాప్య పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకూ లబ్ధిదారులకు ఏటా పెన్షన్ మొత్తాన్ని పెంచుతూ పోతున్నారన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ రూ.2,500 ఉన్న పెన్షన్ ఈ ఏడాది రూ.2,750 పెరిగిందన్నారు. గత తెలుగుదేశం పాలనలో కొత్తగా ఎవరికైనా పెన్షను మంజూరు కావాంటే మరొకటి ఖాళీ అవ్వాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత పొందిన వారిని వెంటనే వలంటీర్లు గుర్తించి పెన్షను నమోదు చేస్తున్నారన్నారు. మండలంలో గత చంద్రబాబు పాలనలో 2018 నాటికి 8,352 మందికి నెల నెలా కేవలం రూ.86.39 లక్షలు పెన్షను రూపేణా పంపిణీ చేసేవారన్నారు. ప్రస్తుతం మండలంలో 1,0652 మందికి రూ.2,93,23,000 ప్రతి నెలా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లను పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతీ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాళ్ళ సత్తిబాబు, పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కాజులూరులో లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ


వెల్ల గ్రామంలో పండగ వాతావరణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో మంగళవారం పండగ వాతావరణ నెలకొంది. రెండు గ్రామ సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు నేతృత్వంలో మంత్రి వేణుకి డోలు, సన్నాయిమేళాలతో ఘన స్వాగతం పలికారు. ఒక్కొక్కటీ రూ.40 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, ఒక్కొక్కటి రూ.21 లక్షల 80 వేలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనం, రూ.20 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ గత ఎన్నికల్లో తమకు ఈ గ్రామంలో మెజారిటీ రాలేదన్నారు. అయినా అభివృద్ధి, సంక్షేమాల్లో ఎక్కడా వివక్ష అనేది చూపకుండా 5 వేల జనాభా ఉన్న ఈ గ్రామానికి ప్రత్యేకంగా రూ.52 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం రూపంలో అందించామన్నారు. 415 మందికి ఇదే గ్రామంలో ఇళ్ల స్థలాలు అందించి, ఇళ్లు కట్టుకునేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. గ్రామంలో రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఎంపీపీ శాకా బాబీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీ షా(బాబ్జీ), ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, స్థానిక నాయకులు పంతగడ విజయప్రసాద్, వట్టికూటి ఏసుబాబు, తోట వీరభద్రరావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటాలి

- ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: విద్యార్థులు చదువుల్లో ప్రతిభ చాటుతూనే క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరావులు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన నియోజక వర్గ స్థాయి క్రీడలు, ఎంపికలను ఎమ్మెల్సీలు ప్రారంభించి ప్రసంగించారు. నియోజకర్గంలోని అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన దాదాపు 60 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ గట్టి పునాది ఉంటే భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ లీగల్ సెల్ నాయకుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు

సోంపల్లి వినాయక మంటపంలో చోరీ

రాజోలు: సోంపల్లిలో వినాయక మంటపంలో పంచలోహ వినాయకుని ప్రతిమ చోరీకి గురైంది. ఈ మేరకు రాజోలు పోలీసులు మంగళవారం సంఘటనా స్థలన్ని పరిశీలించారు. సోంపల్లి పల్లిపాలెంలో ఏర్పాటు చేసి వినాయకుని పందిరిలో పూజల కోసం ఏర్పాటు చేసి పంచలోహ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మంటపంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల వినాయకుని విగ్రహం ఎడమ చేయి భాగం , తొండం ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం ఇదే మంటపంలో ఆకతాయిలు కొందరు వినాయకుని చేతిలో లడ్డూను చోరీ చేసి, మంటపానికి నిప్పు పెట్టే ప్రయత్నం చేశారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పృథ్వీ తెలిపారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యంత పారదర్శకంగా ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 సాగుతోందని ఆర్డీవో ఎస్ఎస్‌బీ వసంతరాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండారులంకలో మూడు పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు చేపట్టినట్లు తెలిపారు. నల్లమిల్లి, అమలాపురం మున్సిపాలిటీలో రెండు, వన్నె చింతలపూడి, ఎస్.కొత్తపల్లిలో ఐదు పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పుకు ప్రతిపాదించామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్ల నియామకాలకు సంబంధించి పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. తహసీల్దార్లు పరమట శ్రీపల్లవి, ప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, పి.శ్రీనివాస్, బడుగు సత్యనారాయణ, కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతరాయుడు

స్వస్థలం చేరుకోనున్న మృతదేహం

సఖినేటిపల్లి: ఉపాధి రీత్యా కత్తర్ దేశంలో ఉంటూ ఇటీవల గుండెపోటుకు లోనై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన నల్లి వెంకట్రావు మృతదేహం టీసీఎఫ్ చర్చి, ఏపీఎన్ఆర్టీస్ సహకారంతో మంగళవారం స్వగ్రామం చేరుకోనున్నది. వివరాలను రామేశ్వరానికి చెందిన కత్తర్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ సోమవారం ఈ మెయిల్ ద్వారా వివరించారు. రత్నాలపేటకు చెందిన వెంకట్రావు 20 ఏళ్ల క్రితం కత్తర్ వచ్చారు. అక్కడ ఉపాధి పొందుతూ గుండెపోటుతో హమద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన మరణించారు. మృతుని బంధువుల ద్వారా విషయం తెలుసుకున్న టీసీఎఫ్ సంఘ పాస్టర్, బిషప్ ఓగూరి బుల్లబ్బాయి స్పందించి భౌతికకాయం ఇండియాకు పంపే ఏర్పాటు చేశారు.

కోలాటంలో ఘర్షణపై కేసు

కొత్తపేట: వినాయకచవితి సందర్భంగా కోలాటంలో ఏర్పడిన ఘర్షణ, ఒక వ్యక్తికి గాయాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. మండల పరిధిలోని వాడపాలెం గ్రామంలో వినాయకచవితి సందర్భంగా యువకులు కర్రలతో కోలాటం ఆడుతున్నారు. వారిలో గనిశెట్టి సత్యసాయి కోలాటం ప్రదర్శన చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బొల్లాటి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు సాయిపవన్ అనే వ్యక్తి కలిసి ఇదేమి కోలాటం అని అపహాస్యం చేశారు. దానితో ఇరువురి మధ్య ఘర్షణ ఏర్పడింది. సత్యసాయిని వెంకటేశ్వర్లు తన చేతిలో ఉన్న కర్రతో కొట్టగా తలకు గాయమైంది. సాయిపవన్ కూడా చేతులతో కొట్టి, కాళ్లతో తన్ని పరారయ్యాడు. బాధితుడిని స్థానికులు కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు.